సాక్షి
నిజామాబాద్
గురువారం । 9 । నవంబర్ । 2023



ఏసీబీ వలలో సబ్‌రిజిస్ట్రార్

బాన్సువాడ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ సతీశ్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.

- IIలో ▸



అక్రమ నిర్మాణం కూల్చివేత

ఆలయ భూమిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని దేవాదాయ శాఖ ఉద్యోగులు కూల్చివేశారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /20.4

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఐదోరోజు 25 నామినేషన్లు

సుభాష్‌నగర్: జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాలకు బుధవారం 25 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. ఆర్మూర్ నియోజకవర్గం నుంచి పైడి రాకేశ్‌రెడ్డి(బీజేపీ), నారాయణపేట రాజేశ్(స్వతంత్ర) నామినేషన్లు సమర్పించారు. బోధన్ నుంచి వి మోహన్‌రెడ్డి(బీజేపీ), పి గోపికిషన్(శివసేన), ఎండీ యూసుఫ్(స్వతంత్ర), సయ్యద్ అస్గర్(స్వతంత్ర), పి రజితవాణి(పిరమిడ్ పార్టీ), మోసిన్(ఎం సీపీఐ) నామినేషన్ పత్రాలు అందజేశారు. బాన్సువాడ నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా కూనింటి రామ్, డి సుభాష్, షేక్ గౌస్, కాంగ్రెస్ నేతలు కాసుల రోహిత్, కాసుల బాలరాజ్, యెండల లక్ష్మీనారాయణ(బీజేపీ), గోపాల్(ఎం-సీపీఐ), తోట శ్రీకాంత్(ధర్మ సమాజ్ పార్టీ) నామినేషన్ దాఖలు చేశారు. నిజామాబాద్ అర్బన్ నుంచి మౌలానా ఖాన్ (స్వతంత్ర), ఎండీ జహీరుద్దీన్ (ఎంబీటీ), లక్క అశోక్ (ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ), ధన్‌పాల్ సూర్యనారాయణ (బీజేపీ), ఫజల్ క్రీం (కాంగ్రెస్) నామినేషన్ వేశారు. నిజామాబాద్ రూరల్ నుంచి గుగులోత్ బాలరాజు (స్వతంత్ర), బీబీనాయక్(స్వతంత్ర) నామినేషన్లు సమర్పించారు. బాల్కొండ నుంచి ఏలేటి అన్నపూర్ణ (బీజేపీ), పల్లికొండ నర్సయ్య (బీఎస్పీ) నామినేషన్ వేశారు. కాగా ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 62 నామినేషన్లు దాఖలయ్యాయి.

నేడు ఆర్మూర్‌కు కేటీఆర్


ఆర్మూర్: బీఆర్‌ఎస్ ఆర్మూర్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి గురువారం నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ హాజరు కానున్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంటారని బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. మంత్రి కేటీఆర్ మధ్యాహ్నం ఒంటి గంటకు ఆర్మూర్ చేరుకుంటారు. ఆలూరు బైపాస్ రోడ్ వద్ద ఆయన ప్రసంగిస్తారు. 50 వేల మంది కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి బలం చాటడానికి బీఆర్‌ఎస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో పలు చోట్ల వర్షం



సుభాష్‌నగర్: జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. 3 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి, డిచ్‌పల్లి, మోపాల్, నిజామాబాద్ రూరల్, ఎడపల్లి, మాక్లూర్, ఆర్మూర్, భీంగల్ మండలాల్లో వర్షం కురిసింది. గురువారం కూడా జిల్లావ్యాప్తంగా అక్కడక్కడ మోస్తారు వర్షం కురిసే అవకాశముంది. వర్షానికి రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది.

ఊపందుకున్న నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ నిజామాబాద్ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్



బీజేపీ ఆర్మూర్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, పక్కన కేంద్రమంత్రి అజయ్‌భట్



బీజేపీ బాల్కొండ అభ్యర్థి అన్నపూర్ణమ్మ, పక్కన ఎంపీలు లక్ష్మణ్, అర్వింద్

- శుక్రవారంతో ముగియనున్న కీలక ఘట్టం
- భారీ ర్యాలీలతో నామినేషన్లు దాఖలు చేస్తున్న అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నామినేషన్లకు శుక్రవారంతో గడువు ముగియనుండగా అభ్యర్థులు భారీ ర్యాలీలతో వెళ్లి దాఖలు చేస్తున్నారు. కొందరు అభ్యర్థులు ఇప్పటికే ఒకటి రెండు సెట్ల నామినేషన్లను స్వయంగా లేదా కుటుంబ సభ్యులు, అనుచరుల ద్వారా రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు.

- నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం విషయానికి వస్తే బుధవారం బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ నగరంలో భారీ ర్యాలీ తీస్తూ వెళ్లి నామినేషన్ సమర్పించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి గణేశ్ గుప్తా, కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్‌అలీ గురువారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు.
- నిజామాబాద్ రూరల్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి గురువారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. బీజేపీ అభ్యర్థి కులాచారి దినేశ్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.
- ఆర్మూర్ బీజేపీ అభ్యర్థి పైడి రాకేష్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. రాకేష్‌రెడ్డి నామినేషన్‌కు కేంద్ర రక్షణ శాఖసహాయ మంత్రి అజయ్‌భట్ హాజరయ్యారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి గురువారం దాఖలు చేయనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డి శుక్రవారం దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.
- బాల్కొండలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. అన్నపూర్ణమ్మ నామినేషన్ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ హాజరయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డి నేడు నామినేషన్ దాఖలు చేయనున్నారు.
- బోధన్ నుంచి బీజేపీ అభ్యర్థి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్ గురువారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు.
- షబ్బీర్‌అలీ బుధవారం కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి తరుపున నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం కామారెడ్డిలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పాల్గొనే బీసీ డిక్లరేషన్ సభ ఉండడంతో కాంగ్రెస్ నాయకులు జోష్‌మీద ఉన్నారు. నామినేషన్ల ఘట్టం శుక్రవారం ముగియనుండడంతో ప్రచార పర్వం తారాస్థాయికి చేరనుంది. ఇక అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అనేలా మాటల యుద్ధం చోటుచేసుకోనుంది. మైకులు మరింతగా హోరెత్తనున్నాయి.

ప్రజలకు సేవ చేసేందుకు వస్తున్నా..



బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, కార్యకర్తలు

- బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ
- అట్టహాసంగా నామినేషన్ ర్యాలీ

సుభాష్‌నగర్: ఇందూరు నగర ప్రజలకు సేవ చేసేందుకే వస్తున్నానని, ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. బుధవారం నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తా శివాజీ విగ్రహం నుంచి ధన్‌పాల్ నామినేషన్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ మున్సిపల్ కార్పొరేషన్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు కొనసాగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, మహారాష్ట్ర ఎమ్మెల్యే రాజేష్ పడవి, ఉపాధ్యక్షుడు వెంకటేష్, మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు పంచరెడ్డి ప్రవళిక శ్రీధర్‌తో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ధన్‌పాల్ విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ ర్యాలీకి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి తనను ఆశీర్వదించారని, ర్యాలీ విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. అర్బన్ నియోజకవర్గాన్ని కమీషన్లు, అవినీతి, కబ్జాలు, మాఫీయాలకు అడ్డాగా మార్చారని, డివిజన్లలో అభివృద్ధి పేరుతో ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా రూ.వందల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కుటుంబ, నియంత పాలనకు ప్రజలు చరమగీతం పాడటం ఖాయమన్నారు. బొడ్డెమ్మ చెరువు బీఆర్‌ఎస్ అభ్యర్థికి మినీ ఏటీఎం అని ఆరోపించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు నాన్ లోకల్ అని, వారిని కలవాలంటే హైదరాబాద్ వెళ్లాల్సి ఉంటుందని, తాను పక్కా లోకల్ ఇక్కడే ఉంటానని పేర్కొన్నారు. ప్రజలంతా బీజేపీ వైపు ఉన్నారనడానికి ఈ ర్యాలీ సాక్ష్యమన్నారు. ట్రస్ట్ ద్వారా ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో ఉన్నానని, వాళ్లలా టూరిస్ట్ లీడర్‌ను కాదన్నారు. బీజేపీ దేశం కోసం, ధర్మం కోసం పని చేస్తుందని, తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తిచేశారు.

కాషాయమయమైన ఇందూరు

బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ నామినేషన్ ర్యాలీకి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కాషాయ, బీజేపీ జెండాలతో ఇందూరు నగరమంతా కాషాయమయమైంది. ఆర్‌ఆర్ చౌరస్తా నుంచి అభ్యర్థి ధన్‌పాల్ సహా బస్వా లక్ష్మీనర్సయ్య, ఇతర నాయకులు ఓపెన్ టాప్ వాహనంలో ర్యాలీగా బయల్దేరారు. నెహ్రూ పార్క్ వద్ద యువకులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. నాయకులు, కార్పొరేటర్లు స్రవంతి రెడ్డి, న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, పంచరెడ్డి లింగం, బంటు రాము, మాస్టర్ శంకర్, ఎర్రం సుధీర్, ఇందిరా వినోద్, సుక్క మధు, పంచరెడ్డి లావణ్య, సుమిత్ర కిశోర్, మమతా ప్రభాకర్, వనిత శ్రీనివాస్, మెట్టు విజయ్, బంటు వైష్ణవి, మీసాల సవిత శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ గెలుపు ఖాయం

- కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్‌భట్
- నామినేషన్ వేసిన బీజేపీ ఆర్మూర్ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి




ఆర్మూర్‌లో బీజేపీ ర్యాలీ

ఆర్మూర్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్‌భట్ అన్నారు. ఆర్మూర్ బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి బుధవారం భారీ ర్యాలీగా తరలివచ్చి నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి హాజరై మాట్లాడారు. మామిడిపల్లిలోని రాకేశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి నామినేషన్ స్వీకరణ కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జానపద కళాకారులు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆర్మూర్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, మంజూరు చేసిన నిధులను వివరించారు. వేల సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు ర్యాలీకి తరలివచ్చారు. రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీకి ఓటు వేసి గెలిపిస్తే రాష్ట్రంలో రామరాజ్యం వస్తుందన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. అనంతరం ఎన్నికల అధికారి వినోద్ కుమార్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు.అల్జాపూర్ శ్రీనివాస్, పల్లె గంగారెడ్డి, కంచెట్టి గంగాధర్, సుచరితరెడ్డి పాల్గొన్నారు.

అవినీతిపరులకు శిక్ష తప్పదు

పెర్కిట్: అవినీతిపరులు ఎంతటి వారైనా శిక్ష తప్పదని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్‌భట్ అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. సరైన ప్రణాళిక లేకుండా నిర్మించడంతోనే మేడిగడ్డ బ్యారేజి కుంగిపోయిందని ఆరోపించారు. అవినీతిమయమైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ పదవికాలం పూర్తి కావడంతోనే అధిష్టానం కొత్త అధ్యక్షుడిని నియమించినట్లు చెప్పారు. తెలంగాణలో బీజేపీ అధికారం చేపడుతోందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గంగారెడ్డి, ఆదిలాబాద్ ఇన్‌చార్జి అల్జాపూర్ శ్రీనివాస్, పెద్దోళ్ల గంగారెడ్డి పాల్గొన్నారు.

అన్నపూర్ణమ్మను గెలిపించాలి



ర్యాలీలో నమస్కరిస్తున్న అన్నపూర్ణమ్మ

భీమ్‌గల్: ఉన్నత విలువలు కలిగిన అన్నపూర్ణమ్మను గెలిపించాలని ఎంపీ అర్వింద్ కోరారు. బాల్కొండ బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ బుధవారం భీమ్‌గల్‌లో నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అర్వింద్, రాజ్యసభ సభ్యుడు కె లక్ష్మణ్ హాజరయ్యారు. ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అవినీతి రాజ్యమేలుతుందని, గంజాయికి అడ్డాగా మార్చారని విమర్శించారు. బెదిరింపు రాజకీయలకు స్వస్తి పలకాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు. రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. మతోన్మాద, రజాకార్ల పాలనకు ప్రజలు తమ ఓటుతో స్వస్తి పలకాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ బిడ్డను జిల్లా ప్రజలు ఓడిస్తే దొడ్డి దారిన ఆమెకు పదవి కట్టబెట్టారని విమర్శించారు. అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ.. అవినీతి పాలనను అంతం చేయడానికి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. బీజేపీ నాయకుడు చికోటి ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



సుభాష్‌నగర్: జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తో కలిసి ఆయన ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 833 ప్రాంతాల్లో మొత్తం 1,549 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లాలో 80 ఏళ్ల పైబడిన 17,580 మంది, 40శాతంపైబడి వైకల్యం కలిగిన దివ్యాంగులు 23,919 మంది ఓటర్లు ఉన్నారని, వీరికి ఇంటి నుంచే ఓటేసేందుకు వీలుగా ఫారం-12 (డి) పంపిణీ చేశామని వివరించారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 260 మంది రౌడీషీటర్లు, 41 మంది కమ్యూనల్ రౌడీలను బైండోవర్ చేశామని తెలిపారు. లైసెన్సులు కలిగిన 69 ఆయుధాలను డిపాజిట్ చేయించామన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా 1,750 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటారని, మరో 9 కంపెనీల కేంద్ర బలగాలను జిల్లాకు కేటాయించారని, వీరిలో ఇప్పటికే మూడు కంపెనీల బలగాలు చేరుకున్నాయని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరిస్తామన్నారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, అదనపు డీసీపీ జయరాం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత ఆస్తులపై చర్చకు సిద్ధమా

మాజీ మంత్రి, అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న కాంగ్రెస్ అర్బన్ అభ్యర్థి షబ్బీర్ అలీ

ఖలీల్‌వాడి: ఎమ్మెల్సీ కవిత ఆస్తులపై చర్చకు సిద్ధమా అని మాజీ మంత్రి, కాంగ్రెస్ నిజామాబాద్ అర్బన్ అభ్యర్థి షబ్బీర్ అలీ సవాలు చేశారు. బుధవారం ఆయన నిజామాబాద్‌లో మాట్లాడారు. కవితకు ఇన్ని కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. లిక్కర్ కేసులో రూ.100 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. తాను మంత్రిగా చేసినప్పటికి ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్ కోసం ఎమ్మెల్సీ కవిత పోరాటం చేస్తున్నారని, తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు బెల్ట్‌షాపులు రద్దు చేయాలని కోరితే ఎందుకు స్పందించడం లేదన్నారు.

మద్యం ద్వారా రూ.11 వేల కోట్ల ఆదాయం రావడంతో దీనిపై కవిత మాట్లాడటం లేదని విమర్శించారు. ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా దళితబంధులో 30 శాతం వాటా తీసుకున్నారని ఆరోపించారు. జిల్లాలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి తప్ప కొత్తగా ఏమీ చేయలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో రైల్వే మీటర్ గేజ్‌ను బ్రాడ్ గేజ్‌గా మార్చామని, తెలంగాణ యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ, పీఎఫ్, ఈఎస్ఐ, పాస్‌పోర్టు ఆఫీసులు ఏర్పాటు చేశామన్నారు. తనతో పాటు డీఎస్, సుదర్శన్‌రెడ్డి జిల్లా అభివృద్ధికి కృషి చేసినట్లు చెప్పారు. బీజేపీ బీడీ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని, డబ్ల్యూహెచ్‌వోతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఒప్పందం చేసుకొని బీడీలు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. బీడీ కార్మికులకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ గోషామహల్‌లో పోటీ చేయకుండా కామారెడ్డిలో ఎందుకు పోటీ చేస్తున్నారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒక్కటే అని ఆరోపించారు. కామారెడ్డిలో కేసీఆర్ పోటీ చేయడంతో రేవంత్‌రెడ్డి పోటీ చేయాల్సి వస్తుందన్నారు. అందులో భాగంగా తనకు నిజామాబాద్ అర్బన్ కేటాయించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, గడుగు గంగాధర్, బొబ్బిలి రామకృష్ణ, గడుగు రోహిత్, భక్తవత్సలం, దయాకర్ గౌడ్ ఉన్నారు.

ఆత్మీయత, అహంకారానికి మధ్య ఎన్నికలు



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్

బోధన్/బోధన్‌టౌన్: తెలంగాణలో ఈసారి ఎన్నికలు బీఆర్‌ఎస్ ఆత్మీయత, కాంగ్రెస్ అహంకారానికి మధ్య జరుగుతున్నాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్ రైతు బంధు ఇస్తుంటే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతులకు బిచ్చమేస్తున్నాడని, వ్యవసాయానికి 3 గంటల ఉచిత కరెంట్ సరిపోతుందని, ఉద్యమంలో పోరాడిన విద్యార్థులను అడ్డమీది కూలీలంటూ మాట్లాడుతున్నాడని విమర్శించారు. బుధవారం రాత్రి బోధన్‌లోని ఏకచక్రనగర్‌లోని కౌండిన్య గౌడ కళ్యాణ మండపంలో నిర్వహించిన గౌడ ఆత్మీయ సమ్మేళనానికి కవిత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆనాటి ఆంధ్ర పాలకులు మన భాష, యాసను అవహేళన చేశారన్నారు. కల్లు అంటే ఇకారమని హైదరాబాద్ నగరంలోని కల్లు దుకాణాలను ఆనాడు మూసివేశారని గుర్తు చేశారు. అసెంబ్లీలో నిలబడి కల్లు సొసైటీలను పునరుద్ధరిస్తానని చెప్పిన ఏకైక సీఎం కేసీఆర్ అని అన్నారు.

గౌడ వృత్తి బలోపేతం..

గౌడ కులవృత్తిని బలోపేతం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కవిత పేర్కొన్నారు. ఈత వనాల పెంపకానికి ఐదెకరాలు కేటాయించారని, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని అధికారంగా నిర్వహిస్తున్నారన్నారు. ఎక్సైజ్ మంత్రిత్వ శాఖను గౌడకులస్తునికి అప్పగించారని, 70 వేల మంది గౌడ కులస్తులకు తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించిందన్నారు. ఎలక్షన్లు వస్తేనే మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి బోధన్‌లో కనిపిస్తారని, ఉస్మానియా విద్యార్థులను అడ్డకూలీలు అని రేవంత్ రెడ్డి అన్నాడని విమర్శించారు. గత ప్రభుత్వాల హయాంలో జిల్లాలో రెండు బీసీ వసతి గృహాలు ఉంటే, తెలంగాణ వచ్చిన తర్వాత 23 వసతి గృహాలకు పెంచుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం ఎల్లమ్మ తల్లి గుడుల నిర్మాణానికి ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు.బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 10 లక్షల చొప్పున మంజూరు చేసిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే షకీల్ మాట్లాడారు. గౌడ సంఘం ప్రతినిధులు గంగాధర్ గౌడ్, లింగాల లక్ష్మణ్ గౌడ్, రవి శంకర్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డి, బుర్క శంకర్ గౌడ్, సురేష్‌గౌడ్, రామాగౌడ్, టీఆర్‌ఎస్వీ నాయకుడు శ్రీనివాస్, రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేసీఆర్ నామినేషన్..



సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలుస్తున్న బీఆర్‌ఎస్ అధినేత సీఎం కేసీఆర్ గురువారం నామినేషన్ వేయనున్నారు. అనంతరం పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించే సభలో ఆయన పాల్గొంటారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో భారీ జన సమీకరణకు ఏర్పాట్లు చేశారు. ప్రతి వార్డు, గ్రామం నుంచి జనాన్ని తరలించేలా చర్యలు తీసుకుంటున్నారు.



సీఎం సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు

క్లుప్తంగా

కేజీబీవీ తనిఖీ



మాక్లూర్: మండల కేంద్రంలోని కేజీబీవీని డీఈవో దుర్గాప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌లోని విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల కోసం పాఠశాల ప్రత్యేక అధికారిణి ప్రగతి, ఉపాధ్యాయ బృందం తయారు చేసిన బోధన విధానాన్ని పరిశీలించిన డీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల పనితీరుతో పాటు ప్రత్యేక ప్రణాళికను గమనించి చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులకోసం ప్రత్యేక కార్యచరణను సిద్ధం చేయాలని ఉపాధ్యాయ బృందాన్ని ఆదేశించారు. గతేడాది కంటే ఈసారి ఉత్తీర్ణత శాతం మరింత పెరగాలన్నారు. దోమల వల్ల జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. డీఈవో వెంట ప్రత్యేకాధికారి ప్రగతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

నగరంలో శ్రీవారి రథం శోభాయాత్ర



నిజామాబాద్ సిటీ: కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం శ్రీవారి రథం శోభాయాత్ర బుధవారం నగరంలో పలు మార్గాల్లో కొనసాగింది. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీ హనుమాన్ దీక్ష పీఠాధిపతి సంయుక్త ఆధ్వర్యంలో దుర్గాప్రసాద్ స్వామిజీ పర్యవేక్షణలో యాత్రను ఇందూరు హనుమాన్ దీక్ష గురుస్వామి నాగభూషణం ప్రారంభించారు. ప్రజల్లో భక్తి చైతన్యాన్ని పెంపొందించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం కోటి హనుమాన్ చాలీసా మహాయజ్ఞాన్ని గత జనవరి 21న తిరుపతిలో చేపట్టినట్లు నాగభూషణం తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం జిల్లా కేంద్రానికి చేరుకుందన్నారు. కార్యక్రమంలో దేశాయ్ గంగాధర్, జనగామ చంద్రశేఖర్ శర్మ, పంచరెడ్డి రాజు, సతీశ్, మురళీ, మల్లేశ్, భక్తులు పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై నిఘా

- 239 పోలింగ్ కేంద్రాలు గుర్తింపు
- అప్రమత్తమైన యంత్రాంగం
- అదనపు బలగాల కేటాయింపు
- ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా చర్యలు



కామారెడ్డి క్రైం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలంటే పోలింగ్ మొదలుకొని పూర్తయ్యే వరకు అధికార యంత్రాంగం తగిన కృషి చేయాల్సిందే. ఎన్నికల విధుల్లో పోలీసుల పాత్ర కీలకం. భద్రతా పరమైన చర్యల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో గతంలో జరిగిన పొరపాట్లు, అల్లర్లు, ఇబ్బందికరమైన పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండేందుకు యంత్రాంగం ముందుగానే అప్రమత్తమైంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 239 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యల్లో అధికారులు నిమగ్నమయ్యారు.

భద్రతా ఏర్పాట్లు..

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. సాధారణ పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సిబ్బందికి తోడు భద్రత కోసం ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డ్‌ను మాత్రమే కేటాయిస్తారు. కానీ సమస్యాత్మక పోలింగ్ కేంద్రానికి ఒక ఎస్సై, ఇద్దరు ఏఎస్సై లేదా హెడ్ కానిస్టేబుల్ స్థాయి అధికారులు, ఒక కానిస్టేబుల్, ముగ్గురు ఆర్మ్‌డ్ జవాన్‌లతో కలిసిన బృందాన్ని కేటాయిస్తారు. అంతేగాకుండా ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ మొత్తం వీడియో రికార్డు కానుంది. ఈ పద్ధతిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాల బిగింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించే దిశగా జిల్లాకు 3 పారామిలటరీ బృందాలు వచ్చాయి. వీటికి అదనంగా మరో 4 కంపెనీలకు చెందిన మిలటరీ దళాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

అవగాహన కార్యక్రమాలు..

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటింగ్ శాతాన్ని పెంచడంతో పాటు, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం స్వీప్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలను చేపడుతోంది. ఓటింగ్ విధానం, ఎన్నికల ప్రక్రియపై ఓటర్లకు నమ్మకం పెరిగేలా కళాబృందాల ద్వారా ప్రదర్శనలు, గ్రామసభలను నిర్వహిస్తున్నారు.

అదనంగా 51 కేంద్రాల గుర్తింపు

జిల్లాలో మొత్తం 239 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా అధికారులు గుర్తించారు. కామారెడ్డి నియోజకవర్గంలో 92, ఎల్లారెడ్డిలో 92, జుక్కల్‌లో 55 ఉన్నాయి. 2018లో 188 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉండేవి. వాటికి అదనంగా 51 కేంద్రాలను జోడించారు. ఆయా కేంద్రాల వద్ద గత ఎన్నికల్లో జరిగిన అల్లర్లు, ఇబ్బందికర ఘటనలు, వివాదాలు, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు, పలు అంశాల ఆధారంగానే కాకుండా ఒకే భవనంలో ఎక్కువ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలుంటే ఓటర్ల రద్దీని ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. కాబట్టి అలాంటి పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తిస్తారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వాటి వద్ద చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.

కాసులిస్తేనే కాళ్లు కదిలేది..

- ఏ పార్టీ సమావేశానికైనా హాజరుకు జై అంటున్న జనం
- జన సమీకరణకు తంటాలు పడుతున్న నాయకులు

మోర్తాడ్: ఎన్నికల సీజన్ మొదలైన నాటి నుంచి ఏ పార్టీ సమావేశానికి రావాలన్నా ఎంతో కొంత ఇస్తేనే జనం హాజరయ్యే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో జన సమీకరణకు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి రావడంతో అన్ని పార్టీల నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా మహిళలను సమీకరించడానికి మహిళా సంఘాల అధ్యక్షులు, వీవోఏలను నాయకులు ఆశ్రయిస్తున్నారు. మంగళ హారతి, బోనం ఎత్తుకుంటే రూ.300 చొప్పున, పార్టీ కండువా కప్పుకుని హాజరు కావడానికి రూ.200 చెల్లిస్తున్నారు. వల గొడుగుతో స్వాగతం తెలుపడానికి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తున్నారు. గ్రామాల్లోకి నాయకులు ప్రచారానికి వచ్చిన సమయంలో జనం ఎక్కువగా కనబడటానికి వంద నుంచి రెండు వందల మందిని సమీకరిస్తే రూ.30 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. రోజు ప్రచారానికి తిరిగే వారికి రూ.500లతో పాటు బీరు, బిర్యాణిలను ఏర్పాటు చేస్తున్నారు. తాము రోజంతా పనులు మానుకుని తిరుగుతున్నామని అందువల్ల తమకూ రూ.500లు చెల్లించకుంటే ఎలా అని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. తమ పార్టీ గెలిచిన తరువాత మాకు ఏం చేస్తుందో ఏం చేయదో తెలియదు కాని ఇప్పుడు మాత్రం అడిగినంత ఇస్తేనే వస్తామని స్పష్టం చేస్తున్నారు. పార్టీ క్యాడర్‌కు సైతం ఖర్చు చేయాల్సి రావడం అభ్యర్థులకు ప్రతిబంధకంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏది ఏమైనా ఎన్నికల వేళ ఏ పార్టీ అయినా జన సమీకరణకు ఖర్చు చేయక తప్పని పరిస్థితి ఏర్పడిందని చెప్పవచ్చు.

ఏసీబీ వలలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్

- లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
- నాలుగు గంటల పాటు కార్యాలయంలో సోదాలు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్



అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు

బాన్సువాడ: బాన్సువాడ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ సతీశ్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు బుధవారం పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ పట్టణానికి చెందిన గాండ్ల రుక్మిణి ఇటీవల మృతిచెందడంతో ఆమె పేరుపై ఉన్న పాత ఇంటి స్థలాన్ని సేల్ డీడ్ చేసుకునేందుకు అక్టోబర్ 10న ఆమె ముగ్గురు కుమారులు గాండ్ల అంజయ్య, శ్రీనివాస్, ఉమమహేశ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లారు. పాత ఇంటికి సంబంధించిన 200 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సతీశ్ ఉమమహేశ్‌కు డబ్బులు డిమాండ్ చేయడంతో స్థానిక నాయకులను ఆశ్రయించాడు. దీంతో సదరు నాయకులు, దస్తావేజు లేఖర్లు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ వద్దకు వెళ్లి ఉమమహేశ్ బీఆర్‌ఎస్ నాయకుడని అతని వద్ద డబ్బులు తీసుకోవద్దని విన్నవించారు. రిజిస్ట్రేషన్ చేసిన సదరు అధికారి మోటేషన్ కోసం 15 రోజులుగా మహేశ్‌ను కార్యాలయం చుట్టూ తిప్పించుకున్నారు. ముగ్గురిపై రిజిస్ట్రేషన్ చేసినందున మోటేషన్‌కు రూ.15 వేలు ఇవ్వాలని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ డిమాండ్ చేశారు. దీంతో తాము అంత ఇవ్వలేమని మహేశ్ రూ.9 వేలు ఇచ్చేందుకు అంగీకరించాడు. మహేశ్ ఏసీబీ అధికారులను సంప్రదించడంతో ఉదయం కార్యాలయంలో విధులు నిర్వహించే యూసుఫ్‌కు ఏసీబీ అధికారులు అందించిన రూ.9 వేల నగదును మహేశ్ ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. డబ్బులు డిమాండ్ చేసిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సతీశ్, అటెండర్ యూసుఫ్‌పై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. దాడిలో ఏసీబీ సీఐలు శ్రీనివాస్, నగేశ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

డాక్టర్ సంతోష్‌కుమార్‌కు డాక్టరేట్



సంతోష్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న గవర్నర్

లక్ష్మీకాపూల్: ఐడీబీఐ జనరల్ మేనేజర్ డాక్టర్ సంతోష్ కుమార్‌కు నల్గొండలోని మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. తెలంగాణ రాష్ట్రంలో గృహ రుణాలపై చేసిన పరిశోధన పూర్తి చేసినందుకు వర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ మూడో స్నాతకోత్సవంలో భాగంగా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి స్నాతకోత్సవ నివేదకను సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై పరిశోధన పూర్తి చేసిన పండితులకు గవర్నర్ డాక్టరేట్లను ప్రదానం చేశారు. సంతోష్ కుమార్ కామారెడ్డి జిల్లాకు చెందిన వారు.

15న స్పాట్ అడ్మిషన్

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్‌లో ఉన్న ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో విద్యార్థులు ప్రవేశం పొందేందుకు ఈ నెల 15న స్పాట్ అడ్మిషన్‌ను ఏర్పాటు చేసినట్లు కళాశాల అసోసియేట్ డీన్ కల్పన బుధవారం తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు స్పాట్ అడ్మిషన్‌కు హాజరు కావచ్చని అన్నారు. ఈ నెల 15న హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో స్పాట్ అడ్మిషన్ ఉంటుందని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

గుజరాత్‌లో ప్రతిభ చూపిన తెయూ వలంటీర్లు



జాతీయ సమైక్య శిబిరంలో తెయూ వలంటీర్లు

డిచ్‌పల్లి: గుజరాత్ రాష్ట్రం గోద్రాలో ఉన్న కళాశ్రీ గోవింద్ గురు యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ సమైక్య శిబిరంలో తెయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారని కో–ఆర్డినేటర్ కె.రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 1 నుంచి 8 వరకు జాతీయ సమైక్య శిబిరం కొనసాగిందని శిబిరంలో తెయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు బంజారా సంప్రదాయ నృత్యానికి ద్వితీయ బహుమతి లభించిందన్నారు. స్వాగత కార్యక్రమంలో వలంటీర్ కార్తీక్ నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుందన్నారు. అలాగే 'భావి భారతదేశం –యువత పాత్ర, మానవ వనరుల వినియోగం – పర్యావరణం' అంశాలపై వలంటీర్లు ఉపన్యాసాలు ఇచ్చారు. శిబిరంలో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో జాతీయభావం, భారతీయ కళలు, భాష, సంప్రదాయాలపై అవగాహన ఏర్పడిందని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సరిత పేర్కొన్నారు. కార్యక్రమంలో గుజరాత్ విద్యాశాఖ మంత్రి కుబేర్ డెండోర్, కళాశ్రీ గోవింద్ గురు యూనివర్సిటీ వైస్–చాన్స్‌లర్ ప్రతాప్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

- అక్రమార్కులపై కేసు నమోదు



పిల్లర్లను కూల్చివేస్తున్న దేవాదాయ శాఖ ఉద్యోగులు

నిజామాబాద్ సిటీ: ఆలయ భూమిని ఆక్రమించి కడుతున్న నిర్మాణాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగులు కూల్చివేశారు. అక్రమ కట్టడాన్ని కూల్చేందుకు జేసీబీ యంత్రాన్ని సిబ్బంది తీసుకురాగా ఓ ప్రజాప్రతినిధి అనుచరులు అడ్డుకుని వెనక్కి పంపారు. దీంతో దేవాదాయ శాఖ ఉద్యోగులే రంగంలోకి దిగి అక్రమ కట్టడం పిల్లర్లను స్వయంగా కూల్చివేశారు. నగరంలోని వర్నిరోడ్డులో శ్రీ నీలకంఠేశ్వర ఆలయానికి చెందిన సుమారు 200 గజాల ఖాళీ స్థలం ఉంది. ఇది 1953 నుంచి ఆలయ ఆధీనంలో ఉంది. ఖాళీగా ఉన్న స్థలంపై కబ్జాదారులపై కన్నుపడింది. దీంతో దర్జాగా నిర్మాణం చేపట్టారు. బేస్‌మిట్ లెవల్ పూర్తి చేసి పైకి పిల్లర్లను వేశారు. విషయం తెలుసుకున్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్ సుప్రియ ఇన్‌స్పెక్టర్ కమల, ఈవోలు జి వేణు, శ్రీరాం రవీందర్, ఉద్యోగులను అక్కడికి పంపారు. అక్రమ కట్టడాన్ని కూల్చివేసేందుకు జేసీబీని తీసుకురాగా పనులను మల్లారం మాజీ సర్పంచ్ రాజన్నతో పాటు పబ్బ యాదగిరి, పబ్బ విజయ్ అడ్డుకున్నట్లు ఈవో వేణు తెలిపారు. వీరితో పాటు ఓ ప్రజాప్రతినిధి అనుచరులు కూల్చివేత జరుగకుండా అడ్డుకుని జేసీబీని అక్కడి నుంచి పంపించి వేశారు. చివరకు 5వ టౌన్ పోలీసుల బందోబస్తు మధ్య ఇన్‌స్పెక్టర్ కమల, తన ఉద్యోగులతో పాటు స్వయంగా రంగంలోకి దిగి పిల్లర్లను కూల్చివేశారు. అనంతరం ఆలయ భూమిలో అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తుండగా అడ్డుకున్న యాదగిరి, విజయ్, రాజన్నలపై అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు 5వ టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు వేణు తెలిపారు. వీరిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయ భూమిని కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపట్టింది ఎవరో తెలియదని, వారిని గుర్తించి కేసు పెట్టనున్నట్లు ఈవో తెలిపారు. 1954 నుంచి ఈ భూమి ఆలయ ఆధీనంలో ఉండగా, 1983 నుంచి ఇది తమ ఆధీనంలో ఉందని కబ్జాదారులు చూపెడుతున్న డాక్యుమెంట్లు చెల్లవని ఈవో స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో ఆలయానికి సంబంధించి మరో ఆరు స్థలాలు ఉన్నాయని వీటికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఈవో పేర్కొన్నారు.

ఆకాంక్ష బతికింది

- చిన్నారి గుండె ఆపరేషన్ సక్సెస్
- 'సాక్షి' కథనంతో అందిన విరాళాలు



ఆపరేషన్ విజయవంతమై క్షేమంగా ఇంటికి చేరుకున్న ఆకాంక్ష

డొంకేశ్వర్: ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులే మిన్న అని మదర్ థెరిస్సా చెప్పిన మాట ఇది. అయితే డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లికి చెందిన చిన్నారి ఆకాంక్షను సాయం చేసిన చేతులే కాపాడాయి. గుండె ఆపరేషన్ విజయవంతం కావడంతో ఆకాంక్ష క్షేమంగా ఇంటికి చేరుకుంది. ఆడుకోవాల్సిన వయసులో గుండె సంబంధిత వ్యాధి రావడంతో ఆపరేషన్‌కు రూ.10లక్షల వరకు డబ్బులు అవసరమయ్యాయి. బాలిక తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో పసిపాప కోసం ఎన్నో చేతులు ముందుకొచ్చాయి. నూత్‌పల్లి గ్రామస్తులు తోచినంత విరాళాలు అందజేశారు. దీనికి తోడు 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'ఆకాంక్షను బతికిద్దాం' అనే కథనాన్ని అందరినీ కదిలించింది. దీంతో చాలా మంది దాతలు ముందుకు వచ్చి ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రజలు, ఉద్యోగులు, రెడ్‌క్రాస్ లాంటి స్వచ్ఛంద సంస్థలు విరాళాలు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. నా ఆపరేషన్ కోసం డబ్బులు పంపిన ప్రతి ఒక్కరికి ఆకాంక్ష, బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

పిడుగుపాటుకు ఆంబోతు మృతి

ఇందల్వాయి: మండలంలోని గోల్యా తండాలో పిడుగుపాటుకు ఓ ఆంబోతు బుధవారం మృతి చెందింది. తండాలో పీర్‌సింగ్‌కు చెందిన ఆంబోతు పొలంలో గడ్డి మేస్తుండగా పిడుగుపడినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతి చెందిన ఆంబోతును ఎంపీపీ రమేశ్ నాయక్, రెవెన్యూ, వెటర్నరీ అధికారులు పరిశీలించారు. బాధితుడికి ప్రభుత్వం తరఫున సహాయం అందేలా చూస్తామని ఎంపీపీ తెలిపారు.

తల్లీకొడుకులకు గాయాలు..

మద్నూర్: మండలంలోని కొడిచిరలో పిడుగు పడడంతో వ్యవసాయ పనులు చేసుకుంటున్న తల్లీకొడుకులు లక్ష్మీబాయి, నవీన్‌కు గాయాలైనట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. పొలంలో మక్క సాగు చేస్తుండగా ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో వారు సమీపంలోని చెట్టు వద్దకు వెళ్తుండగా ఉరుములతో చెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టు సమీపంలో ఉన్న లక్ష్మీబాయి, నవీన్‌లు స్పృహ తప్పిపడిపోయారు. గమనించిన కూలీలు వారిని మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించారు.

కుక్కల దాడిలో పలువురికి..

ఎల్లారెడ్డి: మండల కేంద్రంలో పిచ్చి కుక్క దాడిలో పలువురికి గాయాలైనట్లు స్థానికులు బుధవారం తెలిపారు. మదన్‌మోహన్ ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో రోడ్డుపై గుంపులు గుంపులుగా జనాలు ఉండడంతో కుక్క పలువురిని కరవడంతో గాయాలపాలైనట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వేల్పూర్: మండలంలోని వాగులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వినయ్‌కుమార్ బుధవారం తెలిపారు. మృతుడి వయస్సు 30 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. ఎవరైనా మృతుడిని గుర్తిస్తే 8712659862 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సింగిల్ ఫేస్ మోటార్‌లో మంటలు

రుద్రూర్: మండల కేంద్రంలోని ఏడో వార్డులో ఉన్న జీపీ సింగిల్ ఫేస్ మోటర్‌లో బుధవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే సమీపంలో ఉన్నవారు నీరు పోసి మంటలను ఆర్పి వేసి విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. అధికారులు స్పందించి మోటర్‌కు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను యథావిధిగా కొనసాగించాలని స్థానికులు కోరారు.

అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య



అశోక్(ఫైల్)

లింగంపేట: మండల కేంద్రానికి చెందిన కుంట అశోక్(39) రెండు రోజుల క్రితం అదృశ్యం కాగా ఉరేసుకొని మృతి చెందినట్లు ఏఎస్సై ప్రకాశ్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. అశోక్ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో అశోక్ చెట్టుకు ఉరేసుకొని స్థానికులకు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అశోక్‌కు వివాహమై 12 ఏళ్లు గడిచినా పిల్లలు కాకపోవడంతో మనస్థాపానికి గురై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం నిల్వ చేసిన వారిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: పీడీఎస్ బియ్యం నిల్వ చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈనెల 7న సీసీఎస్ సీఐ రమేశ్, ఎస్సై రవీందర్ సిబ్బంది కలిసి పీడీఎస్ గోదాంలో తనిఖీలు నిర్వహించారు. ఆరోటౌన్ పీఎస్ పరిధిలోని నిజాంకాలనీలోని ఓ గోడౌన్‌లో నిర్వాహకుడు హన్నాల ఖాసీంబేగ్‌ను పట్టుకొని విచారించినట్లు తెలిపారు. నిందితుడి నుంచి మారణ ఆయుధాలు, మోటార్ సైకిల్‌లు, ఫోర్‌వీలర్స్, ఒక ఆటో, 180 బ్యాగుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రౌడీ షీటర్ అలీఖాన్ అలియాస్ బర్సాద్ ఆమేర్ జైలుకి వెళ్లే ముందు నిందితుడు హన్నాలఖాసీం బేగ్‌కి మారణ ఆయుధాలను అప్పగించినట్లు తెలిపారు. హన్నాలఖాసీం బేగ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అందరికీ న్యాయం కోసం..

- నేడు న్యాయసేవల దినోత్సవం
- జిల్లాలో గతేడాది 31,219 సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారం



జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: న్యాయానికి గొప్ప, పేద అన్న తేడాలేదు. ఏ పౌరుడు ఆర్థిక, మరే ఇతర కారణాల వల్ల న్యాయం పొందే అవకాశాలు కోల్పోరాదన్న ఉద్దేశంతో.. పౌరులకు ఉచిత న్యాయ సహాయం అందించాలని భారత అత్యున్నత న్యాయస్థానం భావించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక చట్టం రూపొందించింది. దీని ప్రకారం సుప్రీంకోర్టు 1987 నవంబర్ 9న న్యాయసేవా సంస్థను ఏర్పాటు చేసింది. గతేడాది ఈ సంస్థ ద్వారా లోక్ అదాలత్‌లలో 31, 219 సివిల్, క్రిమినల్ కేసులను రాజీపద్ధతిన పరిష్కరించారు. ట్రాన్స్‌జెండర్‌లకు సమాజంలో సముచిత స్థానం కల్పించడంతోపాటు జీవించడానికి వీలుగా ఈ సంస్థ తనవంతు ప్రయత్నాలు చేస్తోంది. అన్నదాతలకు అండగా అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ప్రారంభించింది. ఈ చట్టం రూపొంది నేటికి 36 ఏళ్లు అవుతోంది. న్యాయసేవా సంస్థ దినోత్సవం గురువారం ర్యాలీ నిర్వహించనున్నట్లు జడ్జి సునీత పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు అందుతున్న న్యాయ సేవలపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచాలతో 'సాక్షి' ముచ్చటించింది.

ప్రశ్న: న్యాయసేవల చట్టం ఏర్పాటు, ప్రాముఖ్యత ఏమిటి?

జవాబు: సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో ఉచిత న్యాయవాద సహాయం ప్రాథమిక హక్కుగా నిర్ధారించింది. ఆర్టికల్ 39–ఎ సమాన న్యాయం, ఉచిత న్యాయ సహాయంలో పేర్కొన్న విధంగా న్యాయసేవల ప్రాధికారం చట్టం–1987ను రూపొందించి అమలు చేస్తున్నాం.

ప్రశ్న: న్యాయ సహాయం కొందరికా.. అందరికా?

జవాబు: ఆర్థికంగా వెనుకబడిన అన్ని వర్గాల ప్రజా సమూహాలకు ఉచిత న్యాయసహాయం అందిస్తున్నాం.

■ క్రిమినల్ నేరాల్లో బాధితులను ఎలా గుర్తిస్తారు, పరిహారం ఎలా అందిస్తారు?

■ నేరాలు చాలా రకాలు ఉంటాయి. కానీ ప్రాధాన్యత దృష్ట్యా ఫోక్సో కేసుల్లో బాధితులైన బాలికలకు నేర తీవ్రతను గుర్తించి ఆ మేరకు ఆర్థిక పరిహారం అందిస్తున్నాం. హత్య కేసుల్లో తల్లిదండ్రులను కోల్పోయిన వారికి సంస్థ తగిన ఆర్థిక పరిహారం చెల్లిస్తుంది.

■ రోడ్డు ప్రమాద బాధితులకు నష్టపరిహారం ఎలా అందుతోంది?

■ సంవత్సర కాలంలో జాతీయ లోక్ అదాలత్ ద్వారా బీమా కంపెనీ, బాధిత వర్గాలతో రాజీ కుదిర్చి 253 దావాలలో రూ.16.52 కోట్ల బాధితులకు బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం.

■ న్యాయసేవాధికార సంస్థకు ప్రజల సహకారం..

■ లోక్ అదాలత్‌లను తెలుగులో ప్రజాన్యాయపీఠాలు అని పిలుస్తాం. ప్రజాసమూహాలు ప్రజాపీఠాలను విజయవంతం చేస్తున్నాయి.